




# కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 254
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
ఆదివారం 22 ఫిబ్రవరి 2026


# పేదల ఆదాయం పెంచుతాం...ఆనందాన్ని పంచుతాం

- సంక్షేమం అమలులో ఏపీకి దరిదాపుల్లో ఏ రాష్ట్రమూ రాదు
- మార్చి నెలాఖరుకు అన్ని పంచాయతీల్లో 100 శాతం చెత్త సేకరణ
- ఢిల్లీ ఏఐ సదస్సులో కాంగ్రెస్ ప్రవర్తన దారుణం
- చెత్త విషయంలో జపాన్ తరహాలో అలవాట్లు మార్చుకోవాలి
- వినుకొండ స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు








**వినుకొండ,కలంకౌంటర్ :** పేద ప్రజల ఆదాయాన్ని పెంచి వారి జీవితాల్లో ఆనందాన్ని నింపు తామని... ప్రతి ఒక్కరికి ఆనందం పంచేలా కృషి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు అన్నారు. ప్రజలకు ఆదాయం పెంచే మార్గాన్ని నేర్పించి వారిని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా వినుకొండలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్ర మంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర సాధ్యమని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు.

**పల్నాడులో అడుగుపెడితే వచ్చే వైబ్రేషన్ వేరు..** వినుకొండలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ...'పౌరుషాల గడ్డ పల్నాడులో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నాం. పల్నాడులో అడుగుపెడితే వచ్చే వైబ్రేషనే వేరుగా ఉంటుంది. ఇటీవల కోటప్పకొండలో శివరాత్రి ఉత్సాహంగా జరిగింది. భక్తులతో దద్దరిల్లింది. కోటప్పకొండ తిరునాళ్లు ఘనంగా నిర్వహించారు. శివరాత్రి ప్రభలు అంటే కోటప్పకొండ ప్రభలే గుర్తుకు వస్తాయి. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా బాగా జరుగుతున్నాయి. నేను గతంలో ముఖ్యమంత్రిగా పచ్చదనం-పరిశుభ్రత, నీరు-మీరు, ఆకస్మిక తనిఖీలు వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టాను. స్వచ్ఛాంధ్ర అంటే రోడ్లు ఊడ్చే కార్యక్రమం కాదు. స్వచ్ఛత మన జీవిన విధానంలో భాగం కావాలి' అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

**పరిసరాల శుభ్రత.. మన బాధ్యత..** 'రాష్ట్రంలోని ప్రతి మండలానికో స్వచ్ఛ రథం ఏర్పాటు చేస్తున్నాం. వారానికోసారి రథాలు గ్రామానికి వస్తాయి. ఇళ్లలో పనికి రాని వస్తువులు ఇస్తే బదులుగా నిత్యావసర వస్తువులు ఇస్తారు. అన్నింటికంటే మనకు ముఖ్యమైనది ఆరోగ్యం. ఆరోగ్యం బాగుండాలంటే మంచి పరిసరాలు, శుభ్రమైన కార్యాలయాలు, గ్రామాలు ఉండాలి. నేను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే నాటికి రాష్ట్రంలో 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయింది. వర్షాలకు ఆ చెత్త భూమిలో ఇంకి తద్వారా భూగర్భ జలాలు కలుషితమయ్యే పరిస్థితి వచ్చింది. నూటికి 97 శాతం మున్సిపాలిటీల్లో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరిస్తున్నారు. వచ్చే నెల కల్లా రాష్ట్రంలోని అన్ని పంచాయతీల్లో 100 శాతం ఇంటింటికీ చెత్త సేకరిస్తాం. రాష్ట్రంలో 4,14,004 కుటుంబాలు హోం కంపోస్టింగ్ చేస్తున్నారు. 4,19,288 టెర్రస్ గార్డెన్లు ఉన్నాయి. రాజమండ్రి, కర్నూలు, కడప, నెల్లూరులో - 4లో

## కాంగ్రెస్ కార్యకర్తల నిరసన దిగ్భ్రాంతి కలిగించింది: నారా లోకేశ్

- ఏఐ సదస్సులో యూత్ కాంగ్రెస్ ఆందోళనపై మంత్రి లోకేశ్ ఆగ్రహం



**అమరావతి,కలంకౌంటర్ :** ఢిల్లీలో నిన్న "ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026"లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు సృష్టించిన గందరగోళంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం, విచారం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వేదికపై వారి ప్రవర్తన దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. ఏఐ రంగంలో ఎదుగుతున్న భారత్ శక్తిని ప్రపంచానికి చాటేందుకు ఉద్దేశించిన సదస్సులో ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ మేరకు లోకేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. "ఏఐ సూపర్ పవర్‌గా భారత్ ఎదుగుతున్న తీరును ప్రదర్శించేందుకు ఈ సదస్సు ఒక గొప్ప అవకాశం. అలాంటి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ కార్యక్రమాన్ని రాజకీయ వేదికగా మార్చడం ద్వారా ప్రపంచం ముందు మనందరి ప్రతిష్ఠను తగ్గించారు. ఇది దిగ్భ్రాంతికరం, విచారకరం" అని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశం ఇంతకంటే మెరుగైన గౌరవానికి అర్హమైనదని ఆయన అభిప్రాయపడ్డారు. "మనం ఇలాంటి చిల్లర రాజకీయాలను పక్కనపెట్టి, ఆవిష్కరణలు, నైపుణ్యం ద్వారా దేశ నిర్మాణానికి ప్రాధాన్యత ఇద్దాం" అని లోకేశ్ పిలుపునిచ్చారు. దేశ ప్రతిష్ఠకు సంబంధించిన విషయాల్లో రాజకీయాలు చేయడం తగదని ఆయన హితవు పలికారు.

## మత్స్యకారుల కుటుంబాలకు పెండింగ్ ఎక్స్‌గ్రేషియా విడుదల

– మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి



**అమరావతి, కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మత్స్యశాఖ ఆధ్వర్యంలో గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్ (GAIS) కింద మరణించిన 95 మంది మత్స్యకారుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా సహాయం విడుదల చేసినట్లు వ్యవసాయ, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2018 సంవత్సరం నుండి వివిధ దశలలో పెండింగ్‌లో ఉన్న ఈ కేసులను ప్రత్యేకంగా పరిశీలించి, మొత్తం రూ. 4.75 కోట్లు మంజూరు చేసి విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ పెండింగ్ ఫైళ్లను వేగవంతంగా పరిష్కరించి, 95 మంది లబ్ధిదారులలో 90 మంది కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో ఎక్స్‌గ్రేషియా మొత్తాలు జమ చేయబడినట్లు వెల్లడించారు. మిగిలిన 5 మంది లబ్ధిదారుల ఖాతా వివరాల్లో ఉన్న సాంకేతిక సమస్యల కారణంగా జమ ప్రక్రియ పూర్తికాలేదని, వాటిని త్వరితగతిన పరిష్కరించి మొత్తాలను వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని, బాధిత కుటుంబాలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సహాయం అందేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## మన స్నేహాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటా: జగన్

- మేకపాటి గౌతమ్ రెడ్డి వర్ధంతి నేడు
- 2022 ఫిబ్రవరి 21న గుండెపోటుతో మృతి చెందిన గౌతమ్ రెడ్డి
- గౌతమ్ రెడ్డిని స్మరించుకున్న జగన్



**అమరావతి,కలంకౌంటర్ :** మాజీ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి వర్ధంతి నేడు. ఈ సందర్భంగా తన స్నేహితుడు గౌతమ్ రెడ్డిని వైసీపీ అధినేత జగన్ స్మరించుకున్నారు. ఎక్స్ వేదికగా భోవోద్వేగంతో కూడిన పోస్టును పెట్టారు. మన స్నేహాన్ని, జ్ఞాపకాలను ఎప్పటికీ గుర్తుంచుకుంటానని తెలిపారు. ఒక స్నేహితుడిగా, సోదరుడిగా ఎప్పటికీ గుర్తుండిపోతావని ట్వీట్ లో పేర్కొన్నారు. గౌతమ్ రెడ్డితో జగన్ ఎంతో సన్నిహితంగా ఉండేవారనే విషయం తెలిసిందే. 2022 ఫిబ్రవరి 21న గౌతమ్ రెడ్డి మృతి చెందారు. గుండెపోటుకు గురైన ఆయన హైదరాబాద్ లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఐసీయూలో దాదాపు 90 నిమిషాల పాటు వైద్యులు అత్యవసర చికిత్సలు చేసినప్పటికీ ఆయన ప్రాణాలు దక్కలేదు.



## నిత్యాన్నదాన పథకానికి విరాళం



**మోపిదేవి,కలంకౌంటర్ :** కృష్ణాజిల్లా మోపిదేవి గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి నిత్యాన్నదానం పథకమునకు గుంటూరు వాస్తవ్యులు చెన్నం శెట్టి వెంకటేశ్వరరావు 1,02,555 రూపాయలు చెక్కు రూపంలో ఆలయ సూపర్డెంట్ అచ్యుత మధుసూదన్ రావు కి అందజేసారు .దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

## స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ



**మోపిదేవి,కలంకౌంటర్ :** కృష్ణా జిల్లా మోపిదేవి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానములో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు "స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ" కార్యక్రమం శనివారం ఉదయం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ & కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆలయ సిబ్బందికి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించి, శుభ్రత, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ పట్ల అందరూ కట్టుబడి ఉండాలని, స్వచ్ఛమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రతి ఒక్కరు తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు సిబ్బంది పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించబడింది. సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు.

## 4x100 రిలే విజేతలుగా చీర్ల కిరణ్ జట్టు



**తిరుమల,కలంకౌంటర్ :** టీటీడీ ఉద్యోగుల వార్షిక క్రీడలలో భాగంగా 4x100 రిలే విజేతలుగా చీర్ల కిరణ్, శ్రీనివాస్, మునిశంకర్, మల్లికార్జున జట్టు

## 24 గంటలఆసుపత్రి సేవలు అందుబాటులోకి తెస్తా - పెడన ఎమ్మెల్యే కాగిత




**బంటుమిల్లి,కలంకౌంటర్ :** కృత్తివెన్ను మండలం చిన్నపాండ్రాక లోనీ 30 పడకల ఆసుపత్రి సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తానని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛభారత్ లో భాగంగా శనివారం కృత్తివెన్ను మండలం చిన్న పాండ్రాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. కోటిమ నాయకులు ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ వైద్యాధికారులు సిబ్బంది పరిసరాల శుభ్రం చేసారు. అనంతరం జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలోనూ ఎం.ఎల్.ఎ కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పాండ్రాక30 పడకల ఆసుపత్రి సేవల ను అందుబాటులోనికి తెచ్చే విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి వైద్యారోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి త్వరలో సేవలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తానని కాగిత పేర్కొన్నారు .ప్రభుత్వం ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛభారత్ స్వచ్ఛంద కార్యక్రమం నిర్వహిస్తుందని, ప్రతి ఒక్కరూ తూచా తప్పకుండా స్వచ్ఛభారత్ లో పాలుపంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పి హెచ్ సి వైద్యాధికారి డాక్టర్ సూర్య తేజ ఆసుపత్రి సిబ్బంది మరియు కూటమి నాయకులు కూనపరెడ్డి వీరబాబు, బొర్రా కాశి ,మార్కెట్ యార్డ్ చైర్మన్ ఓడుగు తులసిరావు, భూపతి రమేష్ మాగంటి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

# నేతన్నకు వెంకన్న దీవెన

● ఆప్కోతో టీటీడీ ఒప్పందం ● ఆర్డర్ జారీచేసిన టీటీడీ మార్కెటింగ్ అధికారులు ● కండువాలు, దుశ్శాలువాలు, ఇతర వస్త్రాల పంపిణీ చేయాలని ఆర్డర్ ● ఆప్కో చరిత్రలో తొలిసారి టీటీడీ ఆర్డర్ రాక ● నేతన్నలకు 365ల రోజుల ఉపాధి కల్పనలో మరో ముందుడగు ● చేనేతలకు మేలు కలిగేలా టీటీడీ ఆర్డర్ : మంత్రి సవిత హర్షం ● టీటీడీ పాలకమండలికి ధన్యవాదాలు తెలిపిన మంత్రి

**అమరావతి,కలంకౌంటర్ :** చేనేత రంగ అభివృద్ధికి, ఆప్కో బలోపేతానికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. నేతన్నలకు 365 రోజులు ఉపాధి కల్పన లక్ష్యంగా పలు సంస్థలతో ఆప్కో ఒప్పందం చేసుకుంటోంది. దీనిలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ)తోనూ ఆప్కో ఒప్పందం చేసుకుంది. కలియుగ దైవం తిరుమల తిరుపతి వెంకన్న స్వామిని దర్శించుకునే భక్తులకు వేదాశీర్వచనంలో అందజేసే కండువాలు, దుపట్టాలు, కాటన్ బ్లౌజ్ లు టీటీడీకి సరఫరా చేయడానికి ఆప్కో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు టీటీడీ మార్కెటింగ్ శాఖ నుంచి ఆర్డర్ కాపీ ఆప్కో కు వచ్చింది. టీటీడీ నుంచి ఆప్కో కు ఇటువంటి ఆర్డర్ ఇదే మొదటిసారి కావడం విశేషం. తిరుమల తిరుపతి వెంకన్న దర్శనానికి రోజూ వేలాది మంది భక్తులు వస్తుంటారు. వారిలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సైతం ఉంటున్నారు. తిరుమలకు విచ్చేసే వీఐపీలకు వెంకన్న ప్రత్యేక దర్శనంతో వేద పండితులు వేదాశ్వీరచనం కూడా అందజేస్తుంటారు. వేదాశీర్వచనం చేసే సమయంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు, స్వామి చిత్ర పటంతో పాటు కండువాలు, దుశ్శాలువాలు, కాటన్ బ్లౌజ్ లు అందజేయడం సంప్రదాయంగా వస్తోంది. దీనిలో భాగంగా కండువాలు, దుశ్శాలువాలు, కాటన్ బ్లౌజ్ లు సరఫరా చేయాలని ఆప్కోకు టీటీడీ మార్కెటింగ్ అధికారులు ఆర్డర్ ఇచ్చారు. మొదటి విడతగా మూడు వేల కండువాలు, అయిదు వేల దుశ్శాలువాలు, 90 వేల కాటన్ అప్పర్ లు, 75 వేల కాటన్ బ్లౌజ్ లు తిరుమల దేవస్థానానికి సరఫరా చేయాలోని ఆ ఆర్డర్ లో టీటీడీ అధికారులు పెర్కొన్నారు. టీటీడీకి అందజేసే కండువాలు, దుపట్టాలు, కాటన్ బ్లౌజ్ లపై ఓం నమో



వేంకటేశాయ అని తెలుగులో, సంస్కృతంలో ముద్రించాలని టీటీడీ స్పష్టం చేసింది.

**ఆప్కో చరిత్రలో మొదటిసారి టీటీడీ ఆర్డర్..** భక్తులకు అందజేసే కండువాలు, శాలువాలు, కాటన్ బ్లౌజ్ లు సరఫరా బాధ్యత గతంలో తమిళనాడుకు చెందిన కో ఆప్టెక్స్ కు ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత నేతన్నలకు ఏడాది పాటు ఉపాధి కల్పనే లక్ష్యంలో భాగంగా టీటీడీ నుంచి ఆప్కో కు ఆర్డర్ వచ్చేలా చేసిన కృషి ఫలించింది. ఈ అవార్డు రావడంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత, అధికారులు పాత్ర మరువలేనిది. ఆప్కో ఏర్పడి 51 ఏళ్లలో మొదటిసారి టీటీడీ నుంచి ఆర్డర్ రావడం విశేషం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత చేనేత రంగ అభివృద్ధికి ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. ముఖ్యంగా నేతన్నలకు నిత్యం ఉపాధి కల్పించే దిశగా కో ఆప్టెక్స్, టాటా, తనేరియా, బిర్లా ఆద్యం సంస్థలతో ఆప్కో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఆర్డర్ తో రాష్ట్రంలో చేనేతలకు మరింత ఉపాధి లభించనుందని చేనేత సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. సీఎం చంద్రబాబునాయుడుకు, మంత్రి సవితకు, టీటీడీకి ధన్యవాదాలు తెలియజేశాయి.

**చేనేతకు వెంకన్న దీవెన : మంత్రి సవిత..** నేతన్నలకు 365 రోజుల పాటు ఉపాధి, ఆర్థిక భరోసా కూడిన జీవనం అందించాలన్న సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేతన్నలకు ప్రయోజనాలు కలిగేలా పథకాలు రూపొందిస్తున్నామని, పలు ఒప్పందాలు కూడా చేసుకుంటున్నామని వెల్లడించారు. ఆప్కో చరిత్రలో మొదటిసారి టీటీడీతో ఒప్పందం చేసుకోవడం ఆనందకర విషయమన్నారు. టీటీడీ ఆర్డర్ నేతన్నలకు వెంకన్న దీవెన వంటిదన్నవారు. టీటీడీ, ఆప్కో ఒప్పందం కుదురడంలో ముఖ్యభూమిక పోషించిన చేనేత, జౌళి శాఖాధికారులను మంత్రి సవిత అభినందించారు. ఏపీ నేతన్నలకు మేలు కలిగేలా నిర్ణయం తీసుకున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, పాలకమండలికి మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు.

## దేవుళ్ళ పేరుతో ఆటలాడొద్దు జగన్ !!

● ఈసారి ఆ 11 సీట్లు కూడా రావు ● వైసిపిరాజకీయంపై ఎమ్మెల్యే ఇంటూరి ఆగ్రహం ● వైసిపి హయాంలో 300 పైగా ఆలయాలపై దాడులు ● మీడియా సమావేశంలో మాట్లాడిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



**కందుకూరు,కలంకౌంటర్ :** జగన్మోహన్ రెడ్డికి, వైసీపీ నేతలకు దేవుడంటే భక్తి, భయం లేవు. గడిచిన 5 ఏళ్లలో జగన్ రెడ్డి.. హిందూ మతం, సంస్కృతి పై విషం కక్కాడు. 300కు పైగా ఆలయాల పై దాడులు జరిగాయి. రామతీర్థంలో శ్రీరాముల వారి విగ్రహం తల వేరుచేశారు. అంతర్వేదిలో స్వామివారి రథాన్ని తగలబెట్టారు. తిరుమలను రాజకీయాలకు వాడుకున్న దుర్మార్గుడు జగన్మోహన్ రెడ్డి. వెంకటేశ్వర స్వామిని దర్శించడానికి వెళ్ళినప్పుడు డిక్లరేషన్ పై సంతకం చేయమంటే చేయరు. మాడవీధుల్లో చెప్పులేసుకుని తిరిగారు. గత ఎన్నికల ప్రచారంలో శ్రీవారిలడ్డు ప్రసాదాన్ని ఓటర్లకు పంచిపెట్టారు. వై వి సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ద్వారా తిరుమల ఆలయ పవిత్రతను దెబ్బతీస్తే హిందువుల మనసులు ఎంతో గాయపడ్డాయి. చివరకు వీఐపీ బ్రేక్, సేవా టికెట్లు, ప్రసాదాలు అమ్ముకున్న దుర్మార్గులు వాళ్లు. అన్యమతస్తులను కూడా ఉద్యోగాల్లో చేర్పించిన ఘనత వైసిపి ప్రభుత్వానిది. అన్నిటికీ మించి కల్తీ నెయ్యితో లడ్డు ప్రసాదాన్ని అపవిత్రం చేయడం పరమ దుర్మార్గం. దర్యాప్తులో వైసిపి నేతల ప్రమేయం తేలినా, ఇప్పటికీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. అసెంబ్లీలో కూడా చెప్పులు వేసుకుని దేవుడు పటాలు పట్టుకున్నారు. స్వామివారికి దంపతులు వెళ్లి పట్టు వస్త్రాలు సమర్పించే ఆచారాన్ని పాటించకుండా, జగన్ ఒక్కడే వెళ్లడం ఏమిటి ? ఇప్పటికైనా మించి పోయింది లేదు. జగన్మోహన్ రెడ్డి బుద్ధి తెచ్చుకుని, తిరుమల వెళ్లి లెంపలేసుకుని క్షమాపణ కోరాలి. లేకపోతే ఈసారి ఆ 11 సీట్లు కూడా మిగలవని గుర్తుంచుకోండి. కూటమి ప్రభుత్వం ఫ్రెండ్లీ ప్రభుత్వం. గతంలో ఎమ్మెల్యేలు, మంత్రులకు జగన్మోహన్ రెడ్డి కనీసం అపాయింట్మెంట్ ఇవ్వకపోవడం చూశాం. మా యువ నాయకుడు లోకేష్ చూడండి... మా కుటుంబాలతో ఎంత ఆత్మీయంగా ఉంటున్నాడో ! ఎంత బాగా మాట్లాడుతున్నాడో ! గతంలో జగన్ దగ్గరికి ఎమ్మెల్యేలు వెళితే ఎంత తెచ్చావు అని అడిగేవారు. ఇప్పుడు మేం వెళితే ఏ అభివృద్ధికి, ఎంత నిధులు కావాలి అని అడిగిమరీ ఇస్తున్నారు. చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి వైపు స్పీడ్ గా వెళుతోంది. దేశంలో వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం మన రాష్ట్రానికి వస్తున్నాయి. రాజధాని అమరావతిలో వేలాది మంది కార్మికులు మిషన్లు రాత్రింబవళ్లు పనిచేస్తున్నాయి. పోలవరం పనులు స్పీడ్ గా జరుగుతున్నాయి. మరోవైపు వైజాగ్ ఐటీ హబ్ గా దూసుకుపోతోంది. తిరుమలతో పాటు అన్ని ఆలయాల నిర్వహణ చక్కగా ఉంది. బటన్లు నొక్కే జగన్మోహన్ రెడ్డిని వద్దనుకుని, అభివృద్ధి చేసే చంద్రబాబు నాయుడు పాలనను మరోసారి ప్రజలు కోరుకుంటున్నారని అర్థమవుతోంది. ఈ మీడియా సమావేశంలో నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రూరల్ అధ్యక్షుడు బస్సారెడ్డి కృష్ణారెడ్డి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 26 నుంచి జనసేన ఉద్యమి సభ్యత్వాలు.. నాదెండ్ల మనోహర్ కీలక సూచనలు

- పార్టీ నేతలతో నాదెండ్ల మనోహర్ టెలీకాన్ఫరెన్స్
- క్షేత్రస్థాయిలో భారీగా సభ్యత్వాలు చేయించాలని సూచన
- జెన్ జీని పార్టీకి దగ్గర చేయాలన్న నాదెండ్ల



**విజయవాడ, కలంకౌంటర్ :** జనసేన పార్టీ బలోపేతం దిశగా ఆ పార్టీ మరో కీలక అడుగు వేస్తోంది. జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల 26న ప్రారంభం కానుంది. ఈ ప్రణాళికపై పార్టీ నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన జనసేన అగ్రనేత, మంత్రి నాదెండ్ల మనోహర్... క్షేత్రస్థాయిలో భారీగా సభ్యత్వాలు చేయించాలని సూచించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. రెండు వారాల సమయాన్ని వినియోగించుకుని సమష్టిగా భారీగా సభ్యత్వాలను చేయించేలా లక్ష్యాలు పెట్టుకోవాలని అన్నారు. పార్లమెంటు నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను నియమించనున్నట్టు తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలు సేకరించి స్పష్టమైన నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. స్థానిక సమస్యల పరిష్కారంలో చొరవ చూపితే పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని చెప్పారు. జెన్ జీని పార్టీకి దగ్గర చేయాలని... కొత్త సభ్యుల చేరికపై దృష్టి పెట్టాలని సూచించారు. గతంలో 12.6 లక్షల సభ్యత్వాలు నమోదయ్యాయని... ఈసారి రెట్టింపు సభ్యత్వాలు లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు.

## అమ్మ భాషకు పట్టం కడదాం

**నాగులుప్పలపాడు,కలంకౌంటర్ :** సంఘాలుగా విడిపోయిన మానవులకు భాషలు వేరువేరుగా ఏర్పడ్డాయి .ప్రపంచం ఒక భాషల మయం అని చెప్పాలి.అంటూ ప్రకాశం జిల్లా నవ్యాంధ్ర రచయిత్రుల రచయిత్రుల సంఘం కోశాధికారి కనమర్లపూడి సావిత్రి పేర్కొన్నారు. ఒమ్మేవరం నాగులుప్పలపాడు మండలం ఒమ్మె వరం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు పద్య పఠన పోటీలు నిర్వహించి విద్యార్థులలో మాతృభాష యొక్క ఉపయోగాలను ప్రధానోపాధ్యాయురాలు కనమర్లపూడి సావిత్రి తెలుపుతూ మాతృభాషలో మాట్లాడితే భాష జీవిస్తుందని జీవం పోసుకున్న భాష తరతరాలు వర్ధిల్లుతూ ఉంటుందని పేర్కొంటూ ఇతర భాషలు మనం నేర్చుకోవాలి కానీ మన భాషను ప్రేమగా చూసుకుంటే భాష వర్ధిల్లుతుందని పేర్కొన్నారు ప్రపంచంలో సుమారు 7300 పైచిలుకు భాషలు ఉంటే 3000 పై చిలుకు భాషలు ఇప్పుడు కనిపించుట లేదని దానికి కారణం అంతర్జాతీయంగా వస్తున్న మార్పులు కారణం అంటారు .ఇలాగే గడిస్తే ప్రపంచంలో ఎన్నో భాషలు కనుమరుగవుతాయని దానివలన ఆయా భాషల్లో ఉన్న సౌందర్యం ఆనందం ఆవిరైపోతాయని తెలిపారు ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు ఒక నిమిషం పాటు మాతృభాషలో మాట్లాడటం




పోటీగా నిర్వహించారు. తెలుగు భాషలో అమృతప్రాయమైన పద్యాలను పోటీలుగా నిర్వహించి విద్యార్థులలో భాష పట్ల అనురక్తిని ఆసక్తిని కలగటం కోసం నవ్యాంధ్ర రచయితల సంఘం తన వంతు పాత్రను పోషిస్తుందని తెలిపారు పద్య పట్టణ పోటీలలో ఇతర పోటీల్లో విజేతలుగా నిలిచినటువంటి విద్యార్థినీ విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు ఈ కార్యక్రమంలో పలువురు తల్లిదండ్రులు సహధ్యాయిని సుచరిత ముత్యాలయ్య పాల్గొన్నారు.

## పీఎస్ఎల్వీ వైఫల్యంపై ఉన్నతస్థాయి దర్యాప్తు.. కమిటీని నియమించిన కేంద్రం

● ప్రధాని మాజీ ప్రధాన శాస్త్రీయ సలహాదారు విజయరాఘవన్ నేతృత్వంలో విచారణ

**అమరావతి,కలంకౌంటర్ :** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఇటీవల చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్ ప్రయోగం విఫలం కావడంపై కేంద్ర ప్రభుత్వం ఉన్నతస్థాయి విశ్లేషణ కమిటీని ఏర్పాటు చేసింది. ప్రధానికి గతంలో ముఖ్య శాస్త్రీయ సలహాదారుగా పనిచేసిన కె. విజయరాఘవన్ ఈ కమిటీకి ఛైర్మన్‌గా, ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ ఎస్. సోమనాథ్ కో-ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఈ ఏడాది జనవరి 12న శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్‌ను ప్రయోగించిన విషయం తెలిసిందే. అయితే, మూడో దశ సాలిడ్ మోటారులో సాంకేతిక సమస్య తలెత్తడంతో ప్రయోగం విఫలమైంది. ఈ ఘటనలో డీఆర్‌డీఓకు చెందిన కీలకమైన 'అన్వేష' ఉపగ్రహంతో పాటు మొత్తం 16 ఉపగ్రహాలు కక్ష్యలోకి చేరలేదు. పీఎస్ఎల్వీ రాకెట్ వరుసగా రెండోసారి విఫలం కావడంతో కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తోంది. గతంలో 2025 మే నెలలో ప్రయోగించిన పీఎస్ఎల్వీ-సీ61 కూడా దాదాపు ఇలాంటి కారణాలతోనే విఫలమైంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం తాజా వైఫల్యంపై దర్యాప్తునకు ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ కమిటీ సభ్యులు ఇప్పటికే శ్రీహరికోటలోని షార్ కేంద్రాన్ని, తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌ను సందర్శించి విచారణ ప్రారంభించారు. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా భవిష్యత్తులో చేపట్టే ప్రయోగాలపై ఇస్రో నిర్ణయం తీసుకోనుంది.

## ఓటర్ల మాపింగ్ శాతాన్ని పెంచాలి..

●167- తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి ఎన్.మౌర్య.





**తిరుపతి,కలంకౌంటర్ :** తిరుపతి నియోజకవర్గ పరిధిలో 2002 సంవత్సరపు ఓటర్ల జాబితాతో మాపింగ్ శాతం పెంచేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి మరియు నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి మాట్లాడుతూ పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - 2026 పై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. 2025 జాబితా లోని ఓటర్లను 2002 ఓటర్ల జాబితా లోని ఓటర్లతో మ్యాపింగ్ ప్రక్రియ చేయు నిమిత్తం అందరూ బూత్ లెవెల్ అధికారులు, సూపెర్వైసర్స్, గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి మ్యాపింగ్ శాతాన్ని పెంచాలని తెల్పినారు. ఈ సమావేశంలో తిరుపతి పట్టణ తహశీల్దారు వి. సురేష్ బాబు, ఎన్నికల ఉప తహసీల్దార్ సుధాకర్ నాయక్ & వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పెదప్రోలులో అద్దంకి నాంచారమ్మ గ్రామోత్సవం ప్రారంభం

## ప్రారంభించిన నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్





**మోపిదేవి,కలంకౌంటర్ :** మోపిదేవి మండలం పెదప్రోలు శ్రీ అద్దంకి నాంచారమ్మ తల్లి అమ్మవారి వార్షిక సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం పెదప్రోలు గ్రామోత్సవాన్ని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ విచ్చేసి ప్రారంభించారు. అమ్మవారు గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి పసుపు కుంకుమలు అందుకునేందుకు బయలుదేరారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ ను ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శి ఆకుల వెంకట్రామయ్య, కూరపాటి కోటేశ్వరరావు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కుర్రా గురుప్రసాద్, కమిటీ పెద్దలు సత్కరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ నాదెళ్ల శరత్చంద్రబాబు, మాజీ ఛైర్మన్ యడ్లపల్లి బుజ్జి, యన్నం రత్నారావు, సాంబశివరావు, కూరపాటి సుబ్బారావు, యన్నం రత్తయ్య, పవన్ సాయి కృష్ణ, నాగార్జున, సుబ్బారావు, బాచు రాంబాబు, యడ్ల శేషు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియేట్ పరీక్షలకు పటిష్ట బందోబస్త్ -జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు

## –పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు



**ఒంగోలు,కలంకౌంటర్ :** ఈ నెల 23 నుంచి మార్చి 24 వరకు ప్రతీ రోజు ఉదయం 9 నుండి మధ్యాహ్నం12 గంటల వరకు నిర్వహించు ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా జరిగేలా పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలియచేసారు. పరీక్షల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుందని తెలిపారు. పరీక్షా పత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ ల వద్ద ఆర్మ్ గార్డులను పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని, పరీక్ష పేపర్లు కేంద్రాలకు తీసుకొచ్చేటప్పుడు, సమాధాన పత్రాలు తీసుకెళ్లేటప్పుడు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున పరీక్షా కేంద్రాలు ఆవరణలో బయట వ్యక్తులు లేకుండా చర్యలు తీసుకున్నామని, పరీక్షా కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయిస్తున్నామని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు మరియు డ్రోన్ కెమెరాలు నిఘా ఉంటుంది. ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా 79 కేంద్రాలలో ఇంటర్ పరీక్షలు జరుగుతాయని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కేంద్రాలలో అవసరమైన వరకు బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని, ఎలాంటి అవకతవకలు, మాల్ ప్రాక్టీసుకు అవకాశం లేకుండా పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని పోలీస్ అధికారులకు ఎస్పీ ఆదేశించారు. ఇంటర్మీడియట్ పరీక్షలను సజావుగా ప్రశాంత వాతావరణ నిర్వహించేందుకు ఇతర శాఖల సమయంతో పటిష్టమైన ఏర్పాట్లు చేసామని, ప్రత్యేక మొబైల్ పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేసామని, పరీక్షలు జరుగు సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్లు నిరంతరం తిరుగుతూ ఉంటాయని, పరీక్షా సమయంలో ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు. విద్యార్థులు ఉదయం 9 గంటలు దాటితే పరీక్ష కేంద్రంలోనికి అనుమతించబోరని, కావున దయచేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి సరైన సమయంలో పరీక్షా కేంద్రానికి చేరుకునేలా చూడాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులతో పాటు పరీక్షా కేంద్రం వద్ద విధులు నిర్వహించే అన్ని శాఖల సిబ్బంది కూడా ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతి లేదన్నారు. చిట్టీలు, పుస్తకాలు పెట్టి మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ కు విద్యార్థులు ఎవరైనా పాల్పడితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా ఏ పరీక్షా కేంద్రం వద్ద అయినా ఎటువంటి చిన్న ఘటన జరిగిన వెంటనే డయల్ 100/112 లేదా జిల్లా పోలీస్ వాట్సాప్ 9121102266 కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ తెలియజేసారు.

# నిరసన





**కాకినాడ,కలంకౌంటర్ :** ఇండియా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎక్స్‌పోలో కాంగ్రెస్ గుండాలు భారతమండపంపై దాడి చేసి భారతప్రధాని నరేంద్ర మోడీని అవమానపరచాడని నిరసిస్తూ, భారతీయ జనతా పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు మార్గదర్శకంలో కాకినాడ జిల్లా భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో కాకినాడ కాంగ్రెస్ ఆఫీస్ ఎదుట "కాంగ్రెస్ హటావో దేశ్ బచావో" నినాదాలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా భారతీయ జనతా యువమోర్చా అధ్యక్షులు మొనగాల సాయి గోపి మాట్లాడుతూ కాంగ్రెస్ యువజన విభాగమైన యూత్ కాంగ్రెస్ ఢిల్లీలో జరుగుతున్న ఏ.ఐ సమిట్లో భారతదేశ ఖ్యాతిని ప్రపంచ దేశాల ముందు తగ్గించాలని ఉద్దేశంతో విదేశీ భావజాలానికి అలవాటు పడి తన యువజన విభాగంతో ఇటువంటి పన్నాగానికి ఒడిగట్టారని దుయ్యబట్టారు. తన వైఖరి మార్చుకోవాలని తక్షణమే దేశ ప్రజలకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి పరిస్థితి మళ్లీ పునరావృతం అయితే ఢిల్లీ నుంచి గల్లి వరకు కాంగ్రెస్ నాయకులను తిరగనివ్వమని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ (బిజెపి) కాకినాడ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు, భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) కాకినాడ జిల్లా అధ్యక్షులు మొనగాల సాయి గోపి,జిల్లా ప్రధాన కార్యదర్శులు చోడిశెట్టి రమేష్ బాబు,కుండల సాయి, భారతీయ జనతా పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ముసలిగంటి సురేష్,శంకర్ సింగ్, సివిల్ సప్లై డైరెక్టర్ తుమ్మల పద్మజ, చెక్క రమేష్ ,గోడి వెంకట్,గండి కొండలరావు, భారతీయ జనతా యువ మోర్చా కాకినాడ జిల్లా అధ్యక్షులు మొనగాల సాయిగోపి, భారతీయ జనతా యువమోర్చా(బీజేవైఎం) నాయకులు గుండ్ర అరుణ్ కుమార్,పార్ధసారథి,ఓలేటి రాము, వనమాడి దుర్గబాబు, పడాల శీను,గౌతు చిన్న,. ఇమ్మంది లక్ష్మీ పార్థసారథి , ఓలేటి రాము, గుండ్రా అరుణ్ కుమార్, గౌతు చిన్నారావు, కర్రి సత్యనారాయణ రాజు, కాదా మూర్తి, వనమాడి దుర్గాప్రసాద్ , లచ్చబాబు, పేకేటి రాజు, శ్రీను, పడాల శ్రీనువాసు, సూర్య, వీరేంద్ర, అజయ్, రాజు, కామేష్, స్వామి నాయుడు, దొడ్డి అప్పలరాజు, నైనాపు శివ, కాకి సుబ్బారావు, నాగరాజు, చెల్లూరి సత్యనారాయణ, బద్రి, దుర్గ భవాని, నీలపు సత్యనారాయణ రెడ్డి, గొల్లపల్లి శివ, కె రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న పల్లపోతు



**కందుకూరు,కలంకౌంటర్ :** మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి శనివారం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీ, రాష్ట్ర ఐవిఎఫ్ కోఆర్డినేటర్ పల్లపోతు వెంకటేశ్వర్లు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అంతకుముందు ఆలయ ప్రాంగణంలో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. వీరితోపాటు ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి ముమ్వల శ్రీనివాసులు, మీడియా ఛైర్మన్ చక్కా వెంకట కేశవరావు, జరుగుమల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోట కిషోర్ బాబు స్వామి వారిని దర్శించుకున్నారు.

# పందిటి నూతన గృహప్రవేశంలో పాల్గొన్న పల్లపోతు



**పామూరు,కలంకౌంటర్ :** కనిగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ వాణిజ్యభాగం అధ్యక్షులు, ప్రకాశం జిల్లా యువజన సంఘం అధ్యక్షులు పందిటి హరీష్ నూతన గృహప్రవేశం కార్యక్రమంలో జరిగిన సత్యనారాయణ స్వామి వ్రతం కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ సెక్రెటరీ, రాష్ట్ర ఐవీఎఫ్ కోఆర్డినేటర్ పల్లపోతు వెంకటేశ్వర్లు హాజరై హరీష్ కు శుభాకాంక్షలు తెలిపారు. వీరితో ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి ముమ్వల శ్రీనివాసులు, ఆర్యవైశ్య మీడియా ఛైర్మన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు, జరుగుమల్లి ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు కోట కిషోర్ బాబు తదిత ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

# చెత్త రహిత తిరుపతి నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి - కమిషనర్ ఎన్.మౌర్య








**తిరుపతి,కలంకౌంటర్ :** చెత్త రహిత, సుందర తిరుపతి నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం లో భాగంగా శనివారం నగరంలోని దండి మార్చ్ వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. టీటిడి బోర్డు మెంబెర్ పనబాక లక్ష్మి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ ఛైర్పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, హస్త కళల కార్పొరేషన్ చెర్మన్ హరి ప్రసాద్, నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి.మునికృష్ణ, కార్పొరేటర్ దూది కుమారి, అర్బన్ డెవలప్మెంట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ వూకా విజయకుమార్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, నాయీ బ్రాహ్మణ సంఘం ఛైర్మన్ రుద్రకోటి సదాశివం లు పాల్గొని వ్యర్థాల వలన కలిగే అనర్థాలను ప్రజలకు వివరించి, దుకాణ దారులకు తడి,పొడి చెత్త వేరు చేసేందుకు బుట్టలను అందజేశారు. అందరిచే స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రతినెల మూడవ శనివారం నిర్వహిస్తోందని తెలిపారు. అందులో భాగంగా ప్రతినెల ఒక అంశంపై ప్రజలకు, విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. నగరంలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాల నిర్వహణపై ప్రజల్లో అవగహన కల్పిస్తున్నామని తెలిపారు. తమ ఇంటితో పాటు, పరిసరాలు, కార్యాలయాల్లో వ్యర్థాలు లేకుండా శుభ్రం చేసి, వ్యర్థ రహిత, సుందర తిరుపతి సాధనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఫోర్ బిన్ సిస్టం ద్వారా తడి, పొడి, ప్రమాదకర వ్యర్తాలు, ఈ వేస్ట్ అనే నాలుగు రకాలుగా చెత్త ను వేరు చేసి ఇవ్వాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇండ్ల నుండి ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను హోమ్ కంపోస్ట్ చేసి మొక్కలకు ఎరువుగా వినియోగించుకోవాలని తెలిపారు. హోమ్ కంపోస్ట్ తయారీ విధానం పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో అదనపు కమిషనర్ శారదా దేవి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, డి. ఈ. లు, అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# చిత్తూరును అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం

- జిల్లా కేంద్రమైన చిత్తూరు నగర సమగ్రాభివృద్ధి కోసమే సీసీ రోడ్ల నిర్మాణం
- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్
- లాయర్స్ కాలనీలో సిసి రోడ్లను ప్రారంభించిన ఎంపీ ఎమ్మెల్యేలు



**చిత్తూరు,కలంకౌంటర్ :** జిల్లా కేంద్రమైన చిత్తూరును అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ తెలిపారు.సీసీ రోడ్ల నిర్మాణంతోనే చిత్తూరు నగర సమగ్రాభివృద్ధి సాధ్యమని, ఆ దిశగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. చిత్తూరు నగర పరిధిలోని 4వ డివిజన్ లాయర్స్ కాలనీలో 19-30 లక్షలతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లు, మురుగు కాలువలను శనివారం చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ముఖ్య అతిథులుగా హాజరై, ప్రారంభించారు. అంతకుముందు లాయర్స్ కాలనీకి చేరుకున్న ఎంపీ ఎమ్మెల్యేలకు స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు సాదర స్వాగతం పలికారు. అనంతరం సీసీ రోడ్లు , మురుగు కాలువల ప్రారంభోత్సవ అనంతరం చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లా కేంద్రమైన చిత్తూరు ప్రగతి పై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. ఇందులో భాగంగానే తాము చిత్తూరు నగర సర్వతో ముఖాభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే నగరంలో సిసి రోడ్లు, మురికి కాలువల నిర్మాణాలను చేపట్టి దశలవారీగా చేపట్టి పూర్తి చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అముద ,చూడ ఛైర్పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ రెడ్డి, టిడిపి సీనియర్ నేత కాజూరు బాలాజీ, టిడిపి రాష్ట్ర మహిళా నేత వై.వి.రాజేశ్వరి , మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజు , మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెంకటేష్ యాదవ్, ఆడిటర్ కేశవులు నాయుడు ,టిడిపి నాయకులు గురజాల సురేష్ ,టిడిపి నగరాధ్యక్షులు నరేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి పచ్చప్ప , కార్పొరేటర్లు ఇందు, టిడిపి వాణిజ్య వివాహ విభాగం అధ్యక్షులు టి ఆర్ జనార్దన్ నాయుడు, వార్డు టిడిపి ఇంచార్జ్ నాగలక్ష్మి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయించినా, రవాణ చేపట్టినా, వినియోగించినా జైలుకే - జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్



**విజయనగరం,కలంకౌంటర్ :** గంజాయి విక్రయాలు చేపట్టినా, అక్రమ రవాణకు పాల్పడినా, వినియోగించినా తీవ్రమైన నేరంగా పరిగణించి, చట్ట పరిధిలో కఠిన చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ – మాదక ద్రవ్యాల నియంత్రణలో భాగంగా జిల్లా పోలీసుశాఖ ఒకవైపు కఠినమైన చర్యలు చేపడుతూ, మరోవైపు విద్యార్థులు, యువత, ప్రజలను మాదక ద్రవ్యాల వలన కలిగే దుష్ప్రభావాలను వివరించేందుకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. గంజాయి అక్రమ రవాణకు ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదన్నారు. గంజాయి కేసుల్లో పట్టుబడిన నిందితులను విచారించి, సమాచారం సేకరించడంతోపాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి గంజాయి అక్రమ రవాణకు ప్రధాన సూత్రదారులను గుర్తించి, అరెస్టు చేస్తామన్నారు. గంజాయి అక్రమ రవాణకు పాల్పడినా, సేవించినా, విక్రయించినా పోలీసుశాఖ తీవ్రంగా పరిగణిస్తుందని, వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి అక్రమ రవాణను నియంత్రించేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని, ఆకస్మిక తనిఖీలు చేపట్టడంతోపాటు, చెక్ పోస్టులను బలోపేతం చేసామని జిల్లా ఎస్పీ తెలిపారు. గంజాయి వినియోగం వలన యువత ప్రక్కదారి పడుతున్నారని, మాదక ద్రవ్యాల మత్తులో నేరస్థులుగా మారుతున్నారన్నారు. వారి భవిష్యత్తును చక్కదిద్దేందుకు మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్ధాలను విద్యార్థులకు వివరిస్తూ, వారిని చైతన్యపరుస్తూ, వాటికి దూరం చేసేందుకు తమవంతు ప్రయత్నంగా కళాశాలలు, గ్రామాలను సందర్శించి, విద్యార్థులకు మరియు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్యార్థుల భవిష్యత్తు పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కూడా తమవంతు బాధ్యతను నిర్వహించాలన్నారు. గంజాయి వ్యాపారుల ప్రలోభాలకు, వారు ఇచ్చే నగదుకు ఆశపడి యువత అక్రమ రవాణ ఉచ్చులోపడి, పోలీసులకు చిక్కి, భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారన్నారు. వ్యాపారుల ప్రలోభాలకు లొంగొద్దని, భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని యువతకు జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. జిల్లాలో గంజాయి హాట్ స్పాటులను గుర్తించి, ప్రత్యేకంగా హాట్ స్పాట్ ప్రదేశాలలో నిరంతరం నిఘా పెట్టామని జిల్లా ఎస్పీ తెలిపారు. గంజాయి కేసులలో పట్టుబడిన నిందితులపై హిస్టరీ షీట్స్ తెరిచి వారిపై నిరంతరం నిఘా పెడుతున్నామని, వారిపై పిట్ ఎన్డిపిఎస్ మరియు పిడి యాక్ట్ అమలుచేస్తున్నామని, వారు గంజాయి వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులను కూడా అటాచ్ చేస్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. గంజాయి గురించి ఏదైనా సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా 1972కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ కోరారు.

# శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు,కలంకౌంటర్ :** ప్రముఖ పుణ్యక్షేత్రం, వలేటివారిపాలెం మండలంలోని మాలకొండపై వెలసిన శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామిని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు శనివారం దర్శించుకున్నారు. స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు పండితులు, అధికారులు ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్ ను ఎమ్మెల్యే పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా దర్శన ఏర్పాట్లు చక్కగా ఉండేలా చూడాలని సూపరింటెండెంట్ ప్రసాద్ కు ఎమ్మెల్యే సూచించారు. పలువురు భక్తులతో మాట్లాడి వసతుల గురించి వాకబు చేశారు. అన్న ప్రసాదం స్వీకరించడంతో పాటు భక్తుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, పార్టీ నాయకులు కాకుమాని హర్ష, శనివారపు మాల్యాద్రి, కామినేని అశోక్, గొర్రెపాటి శ్రీను తదితరులు ఉన్నారు.

# నాటకాల రాయుళ్లది రోజుకో రాజకీయం

- అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా అది బూతుల పార్టీనే
- కల్తీ నెయ్యి నిందితులను నడి రోడ్డుపై నిలబెడతాం
- కల్తీ అక్రమాల నుంచి తప్పించుకోడానికే హెరిటేజ్ పై నిందలు
- రాష్ట్రాన్ని కాపాడుకోడానికి ప్రజలూ కలిసి రావాలి.
- వినుకొండ స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు



**వినుకొండ,కలంకౌంటర్ :** తిరుమల లడ్డూ ప్రసాదంలో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన నెయ్యి కల్తీ వ్యవహారంపై సీఎం చంద్రబాబు మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. కల్తీ అక్రమాల నుంచి తప్పించుకోడానికే హెరిటేజ్ సంస్థపై వైసీపీ నిందలు వేస్తోందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో నిందితుల్ని నడి రోడ్డుపై నిలబెడతామని ఆయన తీవ్రస్థాయిలో హెచ్చరించారు. 2024లో అధికారంలోకి వచ్చాక ప్రక్షాళన ప్రారంభించామని అన్నారు. నెయ్యి నమూనాలను నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డుకు పంపిస్తే కల్తీ జరిగినట్లు నివేదిక అందించిందని.. అది అసలు నెయ్యి కాదని తేలిందని స్పష్టం చేశారు. రసాయనాలతో నెయ్యి తయారు చేసి ప్రసాదంలో వినియోగించినట్టు ప్రత్యేక దర్యాప్తు బృందం సెట్ తన నివేదికలో కూడా పేర్కొందని స్పష్టం చేశారు. వినుకొండలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి ప్రజా వేదిక బహిరంగ సభలో ఈ అంశాన్ని ప్రస్తావించారు. గత పాలకులు తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అత్యంత నాసిరకంగా తయారు చేయించారని..2024 కంటే ముందు తిరుమల దర్శనానికి వెళ్లిన వారంతా ఈ అంశాన్ని గుర్తించారని అన్నారు. శ్రీవారి ప్రసాద పవిత్రతను దెబ్బతీసే అధికారం ఎవ్వరికీ లేదని అలాంటి ప్రసాదాన్ని గత పాలకులు అపవిత్రం చేశారని వ్యాఖ్యానించారు. వారు కొనుగోలు చేసిన నెయ్యిని పరీక్షిస్తే జంతువుల కొవ్వు కలిసినట్టు ల్యాబ్ నివేదిక వచ్చిందన్నారు. దీనిపై సెట్ ఏర్పాటు చేస్తే సరఫరా చేసింది నెయ్యే కాదని తేలిందన్నారు. ఆ తప్పును బయటపెడుతుంటే దానిని ఇతరులపై నెట్టి వేయడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారని అన్నారు. వివేకా హత్య ఘటనలో నాటకాల రాయుడు రోజుకో వేషం వేశాడని ఆక్షేపించారు. చిన్నాన్న కుమార్తె కూడా మోసపోయేలా నాటకాలు రక్తి కట్టించారన్నారు.

**తప్పించుకోవడానికి హెరిటేజ్‌పై నిందలు..** గత పాలనలో తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేశారని, అవినీతి జరిగిందని చెబుతుంటే తిరిగి హెరిటేజ్ పై నిందారోపణలు చేస్తున్నారని ముఖ్యమంత్రి అన్నారు. కల్తీ నెయ్యితో ప్రసాదాన్ని కల్తీ చేసిన వ్యక్తులు ప్రభుత్వంపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారని ఆక్షేపించారు. దొంగే దొంగా దొంగా అనే పరిస్థితి వచ్చిందని.. నిందితుల్ని చట్టం ముందు నిలబెడతామని సీఎం స్పష్టం చేశారు. మసీదు, చర్చి, దేవాలయం ఏదైనా వాటి పవిత్రత కాపాడాలని...ముఖ్యమంత్రిగా బాధ్యత చేపట్టగానే టీటీడీలో ప్రక్షాళన చేపట్టామని అన్నారు. శాసన మండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు వెంకటేశ్వర స్వామి ఫొటోలను చెప్పులతో తీసుకెళ్లారని..సభలో రాజకీయం చేసి అనంతరం వేంకటేశ్వరస్వామి ఫొటోలను అక్కడే పడేశారని వ్యాఖ్యానించారు. వారికెందుకు ఇంత అహంకారం అని సీఎం ప్రశ్నించారు. గత పాలనలో రాష్ట్రాన్ని ఆర్థిక విధ్వంసం చేసి పరిశ్రమల్ని తరిమేశారని .. ఆంధ్రప్రదేశ్ కు ఉన్న నమ్మకాన్ని పోగొట్టారని అన్నారు. ప్రభుత్వ ఆస్తులు, కార్యాలయాలు, భవిష్యత్ ఆదాయం తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారని ఆక్షేపించారు. కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర పునర్నిర్మాణం ప్రారంభమైందని అన్నారు.

**నిద్ర లేస్తే వారివి చెత్త రాజకీయాలే..** రాష్ట్రంలో కొందరు చెత్త రాజకీయాలు, రౌడీ రాజకీయాలు చేస్తున్నారని సీఎం ఆరోపించారు. పరామర్శలకు అని వెళ్లి వాళ్ల కార్ల కింద మనుషుల్ని చంపేస్తారని అన్నారు. బూతులు తిట్టిన వాళ్లను.. రౌడీయిజం చేసిన వాళ్లను పరామర్శించే వ్యక్తులు కారు కింద పడిన వారిని మాత్రం పరామర్శించరని సీఎం విమర్శించారు. వైసీపీ నేతల బూతు వ్యాఖ్యలపైనా సీఎం చంద్రబాబు విరుచుకుపడ్డారు. గతంలో అసెంబ్లీలో తన సతీమణిపై దుర్భాషలాడి వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారని... అధికారంలో ఉన్నా విపక్షంలో ఉన్నా ఆ పార్టీ బూతులు మాట్లాడటం మానలేదని అన్నారు. వారితో తిట్టించు కోవడానికే రాజకీయం చేస్తున్నామా? అని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఆబోతుల మాదిరిగా తయారై రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని.. రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యతలో ప్రజలూ కలిసి రావాలని సీఎం వ్యాఖ్యానించారు. చెడును నిరాకరించే పరిస్థితి ప్రజల్లో వచ్చినప్పుడే రాజకీయాల ప్రక్షాళన జరుగుతుందన్నారు. ఎన్నికల ముందు ఉన్నపళంగా అరెస్టు చేస్తున్నట్టు చెప్పి తనను జైల్లో వేశారని అక్కడి నుంచి బయటకు రారని తనకు చాలా మంది చెప్పారని అన్నారు. అయినా కేవలం ప్రజల కోసం రాష్ట్రం కోసమే ఇప్పటికీ పోరాటం చేస్తున్నానని సీఎం వ్యాఖ్యానించారు. గత పాలకులు రాష్ట్రాన్ని గంజాయి మయం చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో మత్తు సేవించి ఆడబిడ్డల జోలికి వస్తే అదే వారికి చివరి రోజు అవుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందనే భయంతో మదనపల్లి అత్యాచార కేసులో మృగాడు ప్రాణాలు తీసుకున్నాడని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకే తన తొలి ప్రాధాన్యమని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో కొందరు చెత్త రాజకీయాలు రౌడీ రాజకీయాలు చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు.

# ప్రయాణికుల తో ముచ్చటించిన కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం లో 3 వ శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం ఆర్టీసీ బస్టాండ్ లో స్వచ్ఛంద కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ తో కలిసి పాల్గొన్న గనుల భూగర్భ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణికులతో కాసేపు ముచ్చటించి ప్రయాణికుల సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఆర్టీసీ డిఎం పెద్దిరాజులు తదితరులు పాల్గొన్నారు.

# వినుకొండ స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు















(మొదటి పేజీ తరువాయి)

రూ.1,254 కోట్లతో పీపీపీ విధానంలో 'వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల'ను మార్చి 15కల్లా వినియోగంలోకి తీసుకువస్తాం'అని సీఎం చంద్రబాబు తెలిపారు.

**ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీ..** 'రాష్ట్రంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధించాం. ప్లాస్టిక్ వల్ల ప్రజలు, పశువుల ఆరోగ్యం దెబ్బతింటోంది. ఘన వ్యర్థాలను ప్రాసెస్ చేసి చెత్త నుంచి సంపద సృష్టించటం, విద్యుత్ ఉత్పత్తి లాంటివి చేస్తున్నాం. చెత్త సేకరణ కోసం ట్రై సైకిళ్లు, ఈ-ఆటోలు, వివిధ యంత్రాలను వినియోగిస్తున్నాం. విశాఖ, గుంటూరులలో చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే ప్లాంట్లు ఉన్నాయి. రాజమండ్రి సహా మరో 5 ప్లాంట్లు త్వరలోనే ఏర్పాటు చేసి చెత్త నుంచి విద్యుత్ తయారు చేసేందుకు చర్యలు చేపడతాం. చెత్త, వ్యర్థాల నిర్వహణలో మన ఆలోచనా తీరు మారాలి. మలేరియా, డెంగ్యూ, డయేరియా లాంటి సంక్రమిత వ్యాధులు తడి వ్యర్థాల కారణంగానే వస్తున్నాయి. జపాన్ లో రోడ్లపై చిన్న కాగితం ముక్క కూడా కనిపించదు. అక్కడి పౌరుల తరహాలో మనమూ కొన్ని అలవాట్లను మార్చుకోవాలి' అని ముఖ్యమంత్రి సూచించారు.

**రాష్ట్రంలో పెను మార్పులు రాబోతున్నాయి..** 'రాబోయే రోజుల్లో ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రంలో పెను మార్పులు తెచ్చేందుకు సిద్ధంగా ఉంది. ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లు అందిస్తున్నాం. నేను స్వయంగా కార్యక్రమంలో పాల్గొంటున్నాను. ఇంత పెద్ద సంక్షేమ కార్యక్రమం అమలు చేయడంలో దేశంలోని మరే రాష్ట్రంలోనూ మన దరిదాపుల్లో లేదు. తల్లికి వందనం పథకం కింద కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా అందరికీ ఆర్థిక సాయం అందించాం. స్త్రీశక్తి పథకం ద్వారా ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాం. దీపం 2.0 ద్వారా ఏడాదికి 3 సిలెండర్లు ఉచితంగా మహిళలకు అందిస్తున్నాం. అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేల రూపాయలు మూడు విడతల్లో రైతులకు అందిస్తున్నాం. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌరుల వద్దకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నాం. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో సంజీవని ప్రాజెక్టు ద్వారా పేదలకు మెరుగైన ఆరోగ్యసేవలు అందిస్తాం. అన్ని నియోజకవర్గాల్లోనూ అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి ఎకరాకు నీరు అందిస్తాం. గిట్టుబాటు ధర వచ్చే పంటలనే రైతులు వేయాలని కోరుతున్నాను. వారసత్వంగా వచ్చే పంటలనే పండిస్తే ఆదాయం తక్కువ వచ్చి ఇబ్బందులు వస్తాయి. రైతుకు టెక్నాలజీ అలవాటు చేస్తున్నాం. ఏఐ ద్వారా వ్యవసాయ నిపుణుణ్ని అందుబాటులోకి తెచ్చి రైతుకు శిక్షణ అందిస్తాం. ఇటీవల బిల్ గేట్స్ రాష్ట్రంలో పర్యటించినప్పుడు మనవాళ్ల టెక్నాలజీ వినియోగాన్ని మెచ్చుకున్నారు. మైక్రో ఇరిగేషన్‌లో దేశంలో మన రాష్ట్రమే మొదటి స్థానంలో ఉంది. రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా చేస్తున్నాం. అందులో భాగంగా వినుకొండను కూడా అభివృద్ధి చేస్తాం. 175 నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. మొదట్నుంచీ డ్వాక్రా మహిళలు నాకు అండగా ఉన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా తయారుచేసే బాధ్యత తీసుకున్నాం. సంక్షేమ కార్యక్రమాల అమలుతో ప్రజల జీవితాల్లో వెలుగులు తెస్తాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**పీ4తో పేదలకు ఆర్థిక చేయూత..** 'సమాజంలో అట్టడుగున ఉన్నవారిని ఆర్థికంగా ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే పీ4 కింద లక్షమంది మార్గదర్శులు... 10 లక్షల మంది పేద కుటుంబాలను దత్తత తీసుకున్నారు. అట్టడుగున ఉండే 20 శాతం బంగారు కుటుంబాలు, పైన ఉండే 10 శాతం మార్గదర్శులు కలిసి పనిచేస్తే రేపటి రోజున ఈ బంగారు కుటుంబాలే మార్గదర్శులు అవుతారు. పీ4 ద్వారా 100 కుటుంబాలను దత్తత తీసుకున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుని అభినందిస్తున్నాను. ఈ పథకం ద్వారా మరింతమంది పేదలకు ఆర్థిక చేయూత అందించేందుకు మరికొందరు ముందుకు రావాలి' అని సీఎం చంద్రబాబు కోరారు.

**ఢిల్లీలో ఏఐ సదస్సు సమయంలో కాంగ్రెస్ ప్రవర్తన దారుణం..** 'ఢిల్లీలో నిర్వహించిన ఏఐ సదస్సుకు నేను హాజరయ్యాను. ప్రపంచంలోని పెద్ద పెద్ద కంపెనీలను ప్రధాని మోదీ ఆహ్వానించారు. సుమారు 60 దేశాల ప్రతినిధులు సదస్సుకు హాజరయ్యారు. విద్య, వైద్యం, వ్యవసాయం సహా వివిధ రంగాల్లో ఏఐ ఏం చేస్తుందో తెలిపారు. ఢిల్లీలో ఇంతమంచి సదస్సు ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ వాళ్లు దారుణంగా ప్రవర్తించారు. ఓవైపు ప్రపంచమంతా టెక్నాలజీలో ముందుకుపోతుంటే.. యువత ప్రయోజనాలు కాపాడాల్సిన పార్టీలు అర్థనగ్న ప్రదర్శన చేయడం నన్ను బాధించింది. దీన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఈ తరహా శైలి దేశానికి నష్టం చేస్తుంది. మన రాష్ట్రంలో గత ఐదేళ్లలో ఏం జరిగిందో చూశాం. ఏపీ అంటే అందరూ ఛీ కొట్టారు. పారిశ్రామికవేత్తలు పారిపోయారు. ఆస్తులు తాకట్టు పెట్టి అప్పులు చేశారు. అరాచక పాలనకు వ్యతిరేకంగా టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి ఎన్నికలకు వెళ్తే ప్రజలు గొప్ప విజయం అందించారు. కొత్త విషయాలు నేర్చుకోవడమే కాకుండా వెంటనే ప్రజల కోసం అమలు చేయడం నాకు అలవాటు. 1995లో ఐటీకి ప్రాధాన్యత ఇచ్చి హైటెక్ సిటీ కట్టాను. 25 ఏళ్లలో దేశంలోనే ఎక్కువ తలసరి ఆదాయం వచ్చే రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. అందుకు మన దూరదృష్టే కారణం. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ వస్తోంది. అమరావతిని క్వాంటమ్ వ్యాలీకి చిరునామా చేస్తాం. విశాఖలో భాగస్వామ్య సదస్సు ద్వారా రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 23 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. మెగా డీఎస్సీ ద్వారా 15,600 మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత ఎన్డీఏ కూటమిదే. రోడ్ల మరమ్మతులు చేపడుతున్నాం. కరెంటు చార్జీలు పెంచబోం. వినుకొండ నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రిని 1000 పడకల ఆస్పత్రిగా మార్చుతాం. ట్రామా కేర్ సెంటర్, డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తాం. వినుకొండలో అగ్రికల్చర్, వెటర్నరీ కాలేజీల ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తాం. బస్టాండ్ ను ఆధునీకరిస్తాం.' అని సీఎం చంద్రబాబు తెలిపారు.

**స్టాళ్ల సందర్శన... ఉత్పత్తుల పరిశీలన..** వ్యర్థాల సేకరణ కోసం వినియోగించే స్వచ్ఛ రథాలను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ప్రజా వేదిక వద్ద వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లతో పాటు మెప్మా, డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. పారిశుధ్య కార్మికుల సేవలను అభినందిస్తూ సన్మానించారు. దాచేపల్లికి చెందిన స్వచ్ఛ రథం డ్రైవర్ దుర్గారావు, హోం కంపోస్టింగ్ విభాగంలో లక్ష్మీ గోవిందమ్మను ముఖ్యమంత్రి సత్కరించి అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, గొట్టిపాటి రవికుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ సహా పలువురు నేతలు పాల్గొన్నారు.










Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com